# లాడ్జి రూం

అప్పుడే వచ్చిన బాంబే ఎక్స్‌ప్రెస్‌లోంచి దిగాం నేనూ, సతీష్.

హైద్రాబాద్ స్టేషన్ రద్దీగా ఉంది. పది గంటలకు ఓ సాహితీ సదస్సు, పుస్తక ఆవిష్కరణ సమావేశానికి హాజరై, రాత్రి బాంబే ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి పూనా వెళ్ళాలి.

ఓ మిత్రుని కథాసంపుటి ఆవిష్కరణ ఈరోజు. బాగా కావలసిన మిత్రుడవడం వల్లా, నా కథల సంపుటి ఆవిష్కరణకు ఆయన హైద్రాబాద్ నుంచి వచ్చినందువల్లా, నాకు భాగ్యనగరం రాక తప్పలేదు.

సతీష్ మంచి పాఠకుడు. సాహిత్యాభిమాని.

శనివారం ఆఫీసు తర్వాత బయలుదేరాం. సోమవారం డ్యూటీ అటెండ్‌కావాలి. సాహిత్యంలో పడి ఉద్యోగ బాధ్యతలు విస్మరించలేము కదా! మంచి హోదాగల ఉద్యోగంలో ఉన్నామాయె! పది గంటలకు కార్యక్రమం.

దిల్‌సుఖ్‌నగర్‌లోని మా బంధువుల ఇంటికి పోవడానికి టైమ్ లేదు. స్టేషన్ దగ్గరే ఏదో ఓ రూం తీసుకుంటే స్నానాలు చేసి చిక్కడపల్లి పోవచ్చు.

సమావేశం తర్వాత సాహితీ మిత్రులతో హస్కు కొట్టి, సాయంత్రం ఆరు గంటల వరకు రూముకు రావాలి. స్నానం, భోజనాదులు చేసి ఎనిమిది గంటల రైలు ఎక్కాలి. ఇదీ స్థూలంగా మా ప్రోగ్రాం.

నాంపల్లి స్టేషన్ దగ్గరి ఇరానీ హోటల్‌లో చాయ్ తాగి, సతీష్‌ను బ్యాగులతో పాటు అక్కడే ఉండమని చెప్పి, లాడ్జిరూం వేటకి బయలుదేరాను. స్టేషన్ దగ్గరి ఒక లాడ్జీ నచ్చలేదు. కొన్ని మరీ మురికిగా ఉన్నాయి. కొన్ని మురికిగానే కాకుండా కాస్ట్లీగా కూడా ఉన్నాయి. మూడు నాలుగు వందలకు తక్కువలో మంచి రూం దొరికేట్టు లేదు. కేవలం స్నానాదులు చేయడానికి అంత డబ్బు ఖర్చు చేయడానికి మనసొప్పలేదు.

స్టేషన్ అవతలివైపు, చవకలో మంచి గదులు దొరుకుతాయని ఒకరు చెప్పారు. అక్కడ ప్రయత్నం చేద్దామని సతీష్ దగ్గరికి వచ్చాను.

అసహనంగా ఉన్న సతీష్, "ఏదో ఓ రూం లెద్దూ" అన్నాడు.

కాని, నాకు నచ్చిన రూము, నేను మెచ్చే ధరలో దొరకాలి! అంతదాగా తృప్తి ఉండదు! అయిదు రూపాయలకు రిక్షా మాట్లాడి స్టేషన్ అవతలివైపుకు బయలుదేరాము. రిక్షా అవతలి వైపుకు చేరగానే చాలా బోర్డులు కనిపించాయి.

రిక్షావాణ్ణి తీరిగ్గా రమ్మని చెప్పి, వడివడిగా ఓ లాడ్జి వైపు నడిచాను.

"నేను మంచి లాడ్జికి తీసికెళతాను సార్" అన్న రిక్షా వాడి మాట వినిపించుకోలేదు. వాడు తన స్పీడు పెంచాడు. కాని ట్రాఫిక్ మూలాన నన్నందుకోలేకపోయాడు.

వాడు స్పీడెందుకు పెంచాడో నాకు తెలుసు. అందుకని వాడికంటే ముందు రెండో అంతస్తులోని లాడ్జికి చేరాను. అక్కడి రూం నచ్చడంతో నూట పాతిక రూపాయలకు సెటిల్ చేశాను. రిక్షావాడి ద్వారా అయితే ఇంకో పాతిక ఎక్కువే అయ్యేది.

పాపం రిక్షావాడు!

నా స్పీడందుకోలేకపోయాడు! వాని మొహం చిన్నబోయింది. ఇచ్చిన అయిదు రూపాయలు గొణుక్కుంటూ తీసుకున్నాడు.

"ఇంత దూరం వచ్చాను. రెండవ అంతస్తుదాకా మీ సామాను మోసాను. ఇంకో అయిదు రూపాయలు ఇవ్వండి సార్" అన్నాడు.

సతీష్ వెంటనే అయిదు రూపాయల నోటు తీసి ఇచ్చాడు.

నాకది నచ్చలేదు. అప్పటికి ఊరుకున్నాను. కార్యక్రమం జయప్రదంగా ముగిసింది.

నా రాకతో, నా మిత్రుడు చాలా సంతోషించాడు. దినమంతా సాహితీ మిత్రుల మధ్య ఆనందంగా గడిపాము. హోటలు రూముకు వచ్చి ఫ్రెష్ అయ్యాం. కాస్త రెస్ట్ తీసుకుని బయలుదేరాము. రైల్వే క్యాంటీన్లో భోంచేసి ట్రైన్ ఎక్కాం.

సతీష్ ఏదో పుస్తకం తిరగేస్తున్నాడు. పొద్దుట రిక్షావాలా గురించి అప్పుడు కదిపాను.

"ఈ రిక్షావాళ్ళు నీకు తెలీదు. వాళ్ళకూ లాడ్జీవాళ్ళకు లావాదేవీలుంటాయి. మనం ఇచ్చే రిక్షా బాడుగ కాక, లాడ్జీ వారి నుండి కమీషను తీసుకుంటారు. అది మన రూం చార్జీలో కలుస్తుంది. అందుకే నేను పొద్దున అంత హడావిడి పడింది. నీవేమో వాడికి అయిదు రూపాయలు అప్పనంగా, అదనంగా ఇచ్చావ్."

"ఎవరి పొట్ట తిప్పలు వారివి. అయిదంకెల జీతం తీసుకునే మనకు అయిదు రూపాయలు లెక్క కాదు!"

"ఇక్కడ ప్రశ్న అయిదు రూపాయలని కాదు. ఈ సమస్య వారి మెంటాలిటీకి సంబంధించినది. నా ప్రమేయం లేకపోతే వాడు మనకి పాతిక రూపాయలకు టోపీ వేసేవాడు. బాడుగ ఎక్కువ అడుక్కోవాలిగానీ, ఈ కమీషను కక్కుర్తి ఏమిటీ?"

"అది లాడ్జీ వ్యాపారంలోని కిటుకు. పోటీల్లో నిలబడాలంటే రిక్షా వారికి కమీషన్ ఇవ్వక తప్పదు. వారే గదా ప్యాసింజరులను తెచ్చేది! ఆ కమీషను రూం బాడుగలో కలుపకపోతే వారికి గిట్టుబాటయ్యేది ఎలా?"

"ఏమైనా ఈ కమీషను పద్ధతిని నేను సమర్థించను."

"అది మన వ్యవస్థలోనే ఉంది. దాన్ని నీవూ, నేనూ మార్చలేం. మనం ట్రావెల్ ఏజెంటు ద్వారా బుక్ చేస్తాం. వారు కమీషను తీసుకోరూ? అదే రిక్షావాడు, మన స్పాట్ ట్రావెల్ ఏజెంట్ అనుకుంటే సరి! వాడి కమీషన్, మన స్థోమతకు మించింది కాదు కదా! ట్రైన్ దిగగానే అలా ఓ రిక్షావాణ్ణి కుదుర్చుకుంటే సరిపోయేది. అనవసర శ్రమ తప్పేది. గంట సమయం కలిసి వచ్చేది.

నేను బదులివ్వలేదు. ఆలోచిస్తే, సతీష్ వాదన సమంజసమే అనిపించింది.

'(అమృత కిరణ్ పక్షపత్రిక 1-7-71996)